పాలకుర్తి గ్రామ సభలో అధికారులపై తిరగబడుతున్న ప్రజలు, వివిధ పార్టీల నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న స్థానిక ప్రజలు

జఫర్‌గఢ్ : ఉప్పుగల్లులో నిరుపేదలకు ఇళ్లు రాలేదంటూ అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

కొడకండ్ల : గ్రామంలో అధికారులపై ఎదురుతిరుగుతున్న ప్రజలు, నాయకులు

# నిరసనలు.. నిలదీతలు

- గందరగోళంగా మూడో రోజు గ్రామసభలు
- అర్హులకు అన్యాయం చేశారంటూ ఆందోళనలు
- జాబితాలు రద్దు చేసి రీ సర్వే చేయాలని డిమాండ్

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 23 : ప్రజాపాలన గ్రామసభలు గందరగోళంగా నడుస్తున్నాయి.. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసాకు అర్హుల జాబితాల్లో తమ పేర్లు లేవంటూ ప్రజలు ఎక్కడికక్కడ అధికారులను నిలదీశారు. దీంతో కొన్నిచోట్ల గురువారం అధికారులు తిరుగుబాట పట్టారు. మరికొన్ని చోట్ల తూతూ మంత్రంగా గ్రామ సభలు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నారని ప్రజలు మండిపడ్డారు. స్టేషన్‌ఘన్‌పూర్ గ్రామ పంచాయతీలో బుధవారం జరిగిన గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను ప్రచురించారు. కాగా, అందులో 80శాతం అనర్హుల పేర్లు, బిల్డింగులు ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల పేర్లు రావడంతో ఇల్లు లేని నిరుపేదలు అవాక్కయ్యారు. అధికారుల తీరును నిరసిస్తూ గ్రామ పంచాయతీ ఎదుట గురువారం రాస్తారోకో చేపట్టారు. అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. పైసలు ఇచ్చిన వారికే పథకాలు అందిస్తే అర్హులకు ఎలా న్యాయం జరుగుతుందని అధికారులను నిలదీశారు. వెంటనే జాబితాను రద్దు చేసి రీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు.

**అర్హులు ఆందోళన చెందొద్దు : ఆర్డీవో వెంకన్న**

పేర్లు రాని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏ పథకానికి అర్హులో తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి న్యాయం చేస్తామని ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. గురువారం మండలంలోని ఇప్పగూడం, తాటికొండ, తానేదార్‌పల్లిలో గ్రామ సభలు జరిగాయి. కాగా ఇప్పగూడం గ్రామ సభలో ఆర్డీవో డీఎస్ వెంకన్న పాల్గొన్నారు.

**పాలకుర్తిలో కాంగ్రెస్ సభగా గ్రామ సభ**

పాలకుర్తి : పాలకుర్తిలో గ్రామసభ కాంగ్రెస్ సభగా మారింది. కాంగ్రెస్ కార్యకర్తలు వీధి రౌడీల్లా వ్యవహరించారు. ప్రజాసంఘాలు బీఆర్ఎస్ శ్రేణులతో ఘర్షణకు దిగారు. పాలకుర్తిలో సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఐదుగురు కానిస్టేబుళ్లతో సభ నడిపించారు. అర్హుల పేర్లు లేకపోవడంతో ప్రజలు తిరగబడ్డారు. వావిలాల, ముత్తారం, సిరిసన్నగూడెం, గూడూరు గ్రామాల్లో ప్రజలు రుణ మాఫీ, పింఛన్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లపథకంపై నిలదీశారు. ప్రజలు ప్రశ్నించడంతో అధికారులు పరుగులు తీశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య, బీజేపీ నాయకుడు కమ్మగాని శ్రీకాంత్ అధికారులపై మండిపడ్డారు. వావిలాలలో మాజీ ఎంపీటీసీ నల్లపు అశోక్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముత్తారంలో చింతకింది ఉపేందర్ మండిపడ్డారు.

రఘునాథపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

**అర్హుల పేర్లు లేని జాబితా ఎందుకు..?**

నర్మెట : అర్హుల పేర్లు లేకుండా అనర్హుల పేర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితాలో ఎందుకు వస్తాయని సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రామిని శివరాజ్ అధికారులను ప్రశ్నించారు. గురువారం మండలంలోని మచ్చుపహాడ్, ఇప్పలగడ్డ, ఇసుకబాయితండా, గుంటూరుపల్లి గ్రామంలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. అనర్హుల పేర్లు జాబితాలో వచ్చాయని ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న శివరాజ్‌ను పోలీసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. ఎస్సై నాగేశ్ కలుగచేసుకొని ఇద్దరిని వారింపజేశారు. అనర్హులకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పథకాలు అందిస్తే ఊరుకునేది లేదని రామిని శివరాజ్ అధికారులకు తెగేసి చెప్పారు. ఇప్పలగడ్డ, గుంటూరుపల్లిలో గ్రామసభ జరిగింది. ఇసుకబాయితండాలో అర్హుల పేర్లు లేవని ప్రజలు అధికారులను నిలదీశారు.

**గందరగోళంగా గ్రామ సభలు..**

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారం, చిన్నరామన్ చర్ల, కొడవటూరు, రామచంద్రాపూర్, మన్‌సాన్‌పల్లి, గంగాపూర్, బోనకొల్లూరు గ్రామాల్లో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి. కొడవటూరులో మాజీ సర్పంచ్ గంగం సతీశ్‌రెడ్డి, గంగాపూర్‌లో మాజీ సర్పంచ్ బందారపు సుశీలవినయ్, చిన్నరామన్‌చర్లలో ఖలీల్‌ఆజాంలు, మన్‌సాన్‌పల్లిలో తారశ్రీధర్ అధికారులను నిలదీశారు. అడుగడుగునా గ్రామసభల్లో బీఆర్ఎస్ నేతలు ప్రజల పక్షాన పోరాడారు. జాబితాల్లో అర్హుల పేర్లు రాకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగాపూర్‌లో బీఆర్ఎస్ గంగాపురం యూత్ అధ్యక్షుడు బంధారం వినయ్ అర్హులకు అన్యాయం చేశారంటూ అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రామారావునాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో మల్లికార్జున్, ఆయా గ్రామాల కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మల్లం శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, భాస్కర్, దయాకర్‌రెడ్డి, జోగిరెడ్డి, ఆజాం, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

**తరిగొప్పలలో..**

తరిగొప్పుల మండలంలోని బొత్తలపర్రె, మాన్‌సింగ్‌తండా, నర్సాపూర్, పోతారం గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో గ్రామసభలు జరిగాయి. నర్సాపూర్‌లో అనర్హులకు స్థానం కల్పించారని అధికారులను నిలదీశారు. దీంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వరాచారీ, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాణాప్రతాప్, ఎంపీవో మాలతి, ఎస్సై శ్రీదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి చిలివేరు లింగం, అంకం రాజారాం, భూక్యా జూంలాల్‌నాయక్, తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, ఏఎస్సై రాజయ్య, మాజీ సర్పంచ్ బెల్లం రాజు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ శశికళ, మంజుల, యూత్ అధ్యక్షుడు మాల్యాల సుధీర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశలు పాల్గొన్నారు.

దేవరుప్పుల : గొల్లపల్లిలో అధికారులను నిదీస్తున్న ప్రజలు

**అధికారులను నిలదీసిన గ్రామస్తులు**

రఘునాథపల్లి : మండలకేంద్రంలో గురువారం జరిగిన గ్రామ సభలో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. మండల కేంద్రానికి చెందిన ఓ పాత్రికేయుడు ఇందిరమ్మ ఇల్లుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అర్హుల లిస్టులో తన పేరు రాకపోవడంతో ఓ విలేకరికే ఇల్లు రాలేదు.. ఇక మాకేమొస్తాయని అర్హులు బాహాటంగానే చర్చించుకున్నారు. కాగా, ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మోహ్సిన్, వ్యవసాయ అధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

**గ్రామసభల్లో.. అధ్యంతం నిలదీతలే**

దేవరుప్పుల : గ్రామసభల్లో అధికారులు అర్హుల జాబితా అని చదివి అభ్యంతరాలు చెప్పండని అడుగుతుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లారితే ఒకే చోట ఉండేవాళ్లమని, అభ్యంతరాలు చెప్పాలని మమ్మల్ని అడిగితే ఎలా అంటూ మండిపడుతున్నారు. మేమంతా ఓట్లేశాం.. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురు చూస్తున్నామని గొల్లపల్లి, లకావత్ తండా, దేవునిగుట్ట గ్రామసభల్లో ప్రజలు అధికారులతో ఖరాకండిగా తెలిపారు. అనర్హులు గ్రామంలో లేని వారి పేర్లు, ఒక్కింట్లో ఇద్దరి పేర్లు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చేర్చారు. ఇది ఎవరిపనని గొల్లపల్లి ప్రజలు అధికారులను నిలదీశారు. చిప్పరాళ్ల బండతండాలో ఇల్లు ఉన్న వాళ్లకే ఇల్లు, ఆత్మీయ భరోసాలో పైరవీలు నడిచాయని ప్రజలు అధికారులపై విరుచుకుపడ్డారు. లకావత్ తండాలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రుణమాఫీ తమకు కాలేదని అధికారులను అడగగా.. మీ పాలనలో మీరేంచేశారని కాంగ్రెస్ నాయకులు ఎదురుతిరడంతో రెండు పార్టీల మధ్య స్వల్ప గొడవ చోటుచేసుకుంది. సింగరాజుపల్లిలో నిరంతరంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపి సభ ముగించారు.

**దేవునిగుట్ట తండాలో రచ్చరచ్చ..**

దేవునిగుట్ట తండా గ్రామసభ రచ్చరచ్చగా మారింది. ఎన్నికల హామీలు అమలు కాలేదని, జనవరిలో ఇండ్ల దరఖాస్తులు పెడితే సర్పంచ్ ఎన్నికల ముందు అర్హుల లిస్టు చదువుతుండ్రు. ఇక మంజూరు లిస్టు ఎప్పుడు చదువుతారని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. తామంతా కాంగ్రెస్ పార్టీకి ఓట్లేశామని, తమకు పథకాలు అందాలని ప్రజలు అడగగా ప్రత్యేకాధికారి, ఎంపీవో సురేశ్‌కుమార్ ఓట్లేసినోడిని అడుక్కోపో అంటూ సభనుంచి నిష్క్రమించడం వివాదాస్పదంగా మారింది.

**ఉప్పుగల్లు గ్రామ సభలో ఆందోళన...**

జఫర్‌గఢ్ : మండలంలోని ఉప్పుగల్లు, రేగడితండా, సాగరం, తిడుగు, కోనాయిచలం, షాపల్లి, ఏబీ తండా, దుర్గా నాయక్‌తండాల్లో నిర్వహించిన గ్రామ సభలకు ఆయా క్లస్టర్‌ల ఇన్‌చార్జిలు అధ్యక్షత వహించారు. ఉప్పుగల్లులో అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరయ్యాయని గ్రామస్తులు అధికారుల స్టేజీ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఎస్సై రామ్‌చరణ్ గ్రామస్తులకు సముదాయించి ఆందోళన విరమింపజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. రేగడితండా గ్రామ సభకు ఆర్డీవో డీఎస్ వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లిస్టులో పేర్లు లేని అర్హులైన వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్, ఎంపీడీవో సుమన్, తహసీల్దార్ శంకరయ్య, ఏవో కరుణాకర్‌రెడ్డి, ఆర్ఐ అనిల్‌బాబు పాల్గొన్నారు.

**అర్హులకు న్యాయం చేయాలి..**

చిల్పూరు : మండలంలోని రాజవరం, పల్లగుట్టలో గ్రామసభల్లో ఆత్మీయ భరోసాలో అనర్హులను తొలగించి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిల్పూరు మండల స్పెషల్ ఆఫీసర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవి లత, ఎంపీవో మధుసూదనాచారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఈవో వినయ్‌కుమార్, సర్వేయర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, ఏఎస్సై వేముల జయకుమార్ పాల్గొన్నారు.

**మూడోరోజూ అదే లొల్లి..**

జనగామ రూరల్ : మండలంలోని ఎర్రగొల్లపహాడ్, వెంకిర్యాల, చీటకోడూర్, ఎల్లంల, పసరమడ్ల, మరిగడి, ఎర్రకుంట తండా గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. అధికారులు చదివిన లిస్టులో తమ పేర్లు లేవని అర్హులు అధికారులను నిలదీశారు. అనర్హుల పేర్లే ఉన్నాయంటూ మండిపడ్డారు. ఇప్పటికైనా అర్హులను గుర్తించి పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, ఎంపీడీవో ఉప్పుగల్లు సంపత్‌కుమార్, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**అధికారులపై ఆగ్రహం..**

కొడకండ్ల : ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కాంగ్రెస్ కార్యకర్తల పేర్లు మాత్రమే ఉన్నాయని, సామాన్యుల పేర్లు రాలేదని అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే గ్రామ సభలు అని డ్రామాలాడుతున్నారని మండల కేంద్రంతోపాటు రామవరం, ఏడునూతుల గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో మండిపడ్డారు.

## జైలు నుంచి యూ ట్యూబర్ రాజ్‌కుమార్ విడుదల

దేవరుప్పుల, జనవరి 23: ఈ నెల 11న పాలకుర్తి పోలీసులు అరెస్ట్ చేసిన యూట్యూబర్ భూక్యా రాజ్‌కుమార్‌ను 12న జైలుకు పంపగా గురువారం జైలు నుంచి విడుదలయ్యాడు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయని పథకాలను ప్రశ్నించే వ్యక్తుల వాయిస్‌లను తన సోషల్ మీడియా ద్వారా యూట్యూబ్‌లో ప్రసారం చేశానని తెలిపాడు. ఈ క్రమంలో పోలీసులు తనపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారని ఆయన తెలిపారు. కాగా వారం రోజుల అనంతరం అతను జైలు నుంచి విడుదల కాగా దేవరుప్పులకు చెందిన బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ధరావత్ రాంసింగ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మండల నాయకుడు జోగు సోమనర్సయ్య, మండల యూత్ నాయకులు వంగ అర్జున్ జైలు వద్ద రాజ్‌కుమార్‌కు స్వాగతం పలికారు.

## పాఠశాలలో 20 మంది పిల్లల చేరిక

జనగామ చౌరస్తా, జనవరి 23 : జనగామ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ ఏరియా సంచార జాతి పిల్లలు 20మందిని గుర్తించి గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆపరేషన్ స్మైల్ XI విభాగం అధికారులు చేర్పించారు. ఈ బాలల తల్లిదండ్రులు సర్కస్ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ శ్రీలత, జనగామ ఎస్సై శ్వేత, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ రవి కుమార్, ఎంఈవో రాజేందర్, డీసీపీయూ యూనిట్ ప్రణయ్, రంజిత్, లావణ్య, పాఠశాల హెచ్‌ఎంలు మల్లారెడ్డి, దివాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, హరిత, అంగన్‌వాడీ టీచర్ అనిత, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కుమారస్వామి, విద్య, కావ్య, స్కోప్ ఎన్జీవో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మనోజ్ కుమార్, నాద్ర తబస్సుమ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మునిగెల రమేశ్

## 25నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 23 : ఈనెల 25 నుంచి 28వరకు సంగారెడ్డి పట్టణంలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ కోరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం పేద ప్రజల పక్షాన పోరాడుతున్న పార్టీ సీపీఎం అని అన్నారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సీపీఎం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, మాజీ ఎంపీ కామ్రేడ్ బృందాకరత్, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారని తెలిపారు. ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొడపాక యాకయ్య, ఘన్‌పూర్ శాఖ కార్యదర్శి చిలుముల్ల భాస్కర్, శివునిపల్లి శాఖ కార్యదర్శి భూశెట్టి రాంబాబు పాలొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎస్సై సృజన్‌కుమార్

## సుభాష్ చంద్రబోస్ జయంతి

దేవరుప్పుల, జనవరి 23 : సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి క్రీడలు ప్రారంభించారు. మండల కేంద్రంలో సాయి ప్రశాంతి పాఠశాలలో ఎస్సై సృజన్ కుమార్ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి క్రీడలను ప్రారంభించారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఖేలోభారత్ పేర 2025 క్రీడోత్సవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ క్రీడల్లో కబడ్డీ, వాలీబాల్, చెస్ క్యారమ్స్ ఉంటాయన్నారు. కాగా ఈ క్రీడలు మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి నగర కార్యదర్శి ధరావత్ శ్రవణ్, కార్యవర్గ సభ్యులు శివార్ల మహేందర్, వట్టిపల్లి గణేశ్, కారుపోతుల నరేశ్ ఉన్నారు.

కోమటిగూడెంలో నిర్వహిస్తున్న ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స

## కోమటిగూడంలో పశువైద్య శిబిరం

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 23 : మండలంలోని కోమటిగూడం గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో ఇప్పగూడం పశు వైద్యాధికారి డా. బీ మౌనిక హాజరై మాట్లాడారు. లింగ నిర్ధారణ వీర్యం అందుబాటులో ఉందని, దీని ద్వారా కేవలం ఆడ దూడలు మాత్రమే పుడుతాయని, దీనిని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. శిబిరానికి వచ్చిన పాడిపశువులకు ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎంపటి రాజేశ్వర్‌రావు, గోపాలమిత్రలు న్యాయం భిక్షపతి, ఎండీ అయాస్, జక్కుల రాజేశ్, నామోజు రమణాచారి, గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 7న మహాప్రదర్శనను విజయవంతం చేయాలి

బచ్చన్నపేట, జనవరి 23 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరాటం సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనమని, భారత అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీంకోర్టు తీర్పుకనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని కోరుతూ మందకృష్ణ మాదిగ ఫిబ్రవరి 7న తలపెట్టిన వేయి గొంతులు-లక్ష డప్పుల దండోరా సాంస్కృతిక మహా ప్రదర్శన కార్యక్రమానికి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు సంకకు డప్పేసుకుని హైదరాబాద్‌కు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగాల ఉపేందర్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అల్వాల ఎల్లయ్య, బేడ బుడగ జంగం మండల అధ్యక్షుడు సిరిపాటి రాందాస్, దండోరా కళా మండలి అధ్యక్షుడు, నేలపోగుల మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్‌మాదిగ, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు చుంచు రాజు, నాయకులు అల్వాల నర్సింగరావు, సందేన రవీందర్, జిల్లా సీనియర్ నాయకులు గువ్వల రవి, బొట్ల మహేశ్, కంతి చరణ్, అల్వాల రాజు, అల్వాల అనిల్, విజయ్, సంపత్, కడారి శ్రీను, గడ్డం రాజు, చింతల సిరి, స్వప్న, కానుగంటి కవిత, దామెర లావణ్య, చైతన్య, పిల్లుట్ల ఉమాపతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పద్మారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

## మాజీ మంత్రి పద్మారావును కలిసిన ఎర్రబెల్లి

దేవరుప్పుల, జనవరి 23 : సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కలిసి పరామర్శించారు. పద్మారావు ఇటీవల ఉత్తరాఖండ్ పర్యటనకు వెళ్లగా అక్కడ స్వల్ప గుండెపోటుతో అస్వస్థతకు గురై చికిత్స పొందారు. అనంతరం హైదరాబాద్‌కు రాగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎర్రబెల్లి వెంట జనగామ జిల్లా బీఆర్ఎస్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, డాక్టర్ రఘు ఉన్నారు

## వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి

బచ్చన్నపేట జనవరి 23 : విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యా బోధన చేయాలని జీసీడీవో గౌసియా సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను, కిచెన్‌లో పాటిస్తున్న శుభ్రత, బోజనంలో నాణ్యతపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ఇన్‌చార్జిగా నాగరాజు

నాగరాజు

జఫర్‌గఢ్, జనవరి 23 : సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ఇన్‌చార్జిగా ఎలుమ కంటి నాగరాజును నియమించినట్లు కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. జఫర్‌గఢ్ మండలంలోని తీగారం గ్రామానికి చెందిన నాగరాజు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉన్నాడని, జిల్లా స్థాయిలో ఆయన సేవలను వినియోగించుకునేందుకు జిల్లా ఇన్‌చార్జిగా నియమించామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జీ ప్రియారెడ్డి, బత్తుల మహేశ్‌కు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పాలి

**మాజీ ఎమ్మెల్యే రాజయ్య**

ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి, జనవరి 23 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అసమర్థ పాలన అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాడికొండ రాజయ్య అన్నారు. మండలకేంద్రంలో రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు మాజీ ఎమ్మెల్యే రాజయ్య హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలనే తపనతో ఎన్నికల ముందు అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ కాలేదని, రైతు భరోసా అందించలేదని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ఆయన అన్నారు. కల్యాణలక్ష్మి ద్వారా రూ.లక్ష116లు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలమయ్యారని, దీంతో పేదింటి ఆడపిల్లలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఇటీవల జరుగుతున్న గ్రామసభల్లో ప్రజా వ్యతిరేక విధానాలను కండ్లకు కొట్టచ్చినట్లు కన్పిస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందనడానికి గ్రామ సభల్లో అధికారులను నిలదీయడమే నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ 10 యేళ్ల పాలనలో రైతులకు సకాలంలో రైతుబంధు, సాగునీరు అందించడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ధర్నాలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్, ముష్టల్ల విజయ్, యూత్ మండల అధ్యక్షుడు దుబ్బాక హరీశ్‌గౌడ్, సీనియర్ నాయకులు సేవెల్లి సంపత్, గూడ కిరణ్, కొర్ర రాజేందర్, గవ్వాని నాగేశ్వరరావు, ముక్క పరశురాములు, గుండె జోసెఫ్, కొయ్యడ స్వామి, శాగ నాగరాజు, ఆ యా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జనగామ చౌరస్తా, జనవరి 23 : గణతంత్ర దినోత్సవ (రిపబ్లిక్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించే ప్రదేశాన్ని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ చేతన్ నితిన్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. అతిథుల కోసం స్టేజీ, వీఐపీ, మీడియా గ్యాలరీ సీటింగ్ అరెంజ్‌మెంట్, బారికేడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. స్టేడియం చదును చేయడంతోపాటు పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పర్యాటక, మెప్మా, విజయ డెయిరీ, చేనేత జౌళి వంటి శాఖలతో స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం, 108అంబులెన్స్, అగ్నిమాపకశాఖ ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. పోలీసులు గౌరవ వందనం, పరేడ్‌తోపాటు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన విధంగా గ్రౌండ్‌ను సిద్ధం చేయాలన్నారు. వేడుకలు నిర్వహించే స్టేడియంలో ప్లాస్టిక్ వినియోగం లేకుండా 'ఫ్రీ ప్లాస్టిక్ జోన్' ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపీరామ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లలో అర్హులకు న్యాయం చేయాలి

ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 23 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు కాకుండా, చాలా వరకు ఉన్నత స్థాయిలో ఉన్నవారికి, ప్రభుత్వ ఉద్యోగులకు, పెళ్లి కానివారికి ఉన్నాయని, రీసర్వే చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్, సీపీఎం నాయకులు గురువారం ఆర్డీవో వెంకన్నకు వినతి పత్రం అందించారు. విషయంపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టి సారించి లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీసెల్ స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ చైర్మన్ గుగులోత్ అరుణ్‌లాల్, ఘన్‌పూర్ ఎస్సీసెల్ మండల అధ్యక్షులు సింగపురం రాజయ్య, బీసీసెల్ నాయకులు గట్టు ప్రశాంత్, గట్టు సురేందర్, సీపీఐ జిల్లా నాయకులు ఎండీ రహ్మతుల్లా, ఎండీ యూనస్, మాతంగి కుమార్, చింత సురేశ్, కిశోర్, గూటం మహేశ్, సీపీఎం మండల కార్యదర్శి మునిగల రమేశ్, ఇప్పగూడం గ్రామ కార్యదర్శి యాకయ్య పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, జనవరి 23 : ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆంగ్ల మాధ్యమంలో 5, 6, 7, 8, 9వ తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కులం, నివాసం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలను సత్వరం పొందడానికి ప్రతిరోజు ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటలలోపు ఈ సహాయ కేంద్రం సెల్ నంబర్ 9052308621 అందుబాటులో ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 23న ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**కావలెను**

★ వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ లో పనిచేయుటకు కంప్యూటర్ MS OFFICE, WORD, EXCEL ఆపరేటింగ్ లో డిగ్రీ అర్హతతో తెలుగు & ఇంగ్లీష్ TYPE Writing లో అనుభవం కలిగిన మహిళలు/ పురుష అభ్యర్థులు మరియు ఆఫీసులో పనిచేయుటకు ఆఫీస్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. సంప్ర :9866160555

NTW-326584

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.

NT-327009-All

**LOSS OF PASSPORT**

★I, KALLEM MOHAMMED S/o. Saleem, R/o H.No. 11-23-1242, Telecom Colony, L.B.Nagar, Warangal City & District, I have lost my original Passport bearing No. E4966294 while travelling in an auto-rickshaw from Pochammamaidan to L.B. Nagar, Warangal. If anyone is found, please inform me above address and Cell: 9490670307.

NTW-000

**CHANGE OF NAME**

★I, SAYEED SHAHEEN SULTANA (Old Name) R/o. H.No.22-7-16, Gouthami Nagar, Doctors Colony-I, Warangal Dist, T. S, have Changed my name from SAYEED SHAHEEN SULTANA to SYEDA SHAHEEN SULTANA (New Name) W/o.SYED FAHEEM.

NTW-6037

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565